జమ్మలపాలెం సమీపంలో విక్రయానికి ఉంచిన పుచ్చకాయలు



పుచ్చకాయలను కోసి ప్లేట్ల రూపంలో అందిస్తూ..



కూల్ కూల్‌గా.. తియ్య తియ్యగా..

- నోరూరిస్తున్న పుచ్చకాయలు
- ఎండల తాకిడికి జోరందుకున్న వ్యాపారం
- పోషకాలు పుష్కలం అంటున్న నిపుణులు

జలదంకి : ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. ఉదయం పది దాటితే వేడిగాలులు ప్రారంభమవుతున్నాయి. ప్రజలు కూడా నిత్యావసర వస్తువుల కొనుగోళ్లకు బయటకు వచ్చి ఎండల తాకిడితో సతమతమవుతున్నారు. ఈ సమయంలో దారి పొడవునా నేనున్నానంటూ అటు దాహార్తిని, ఇటు ఆకలిని తీరుస్తోంది పుచ్చకాయ. సాధారణ వ్యక్తి కూడా కొనుగోలు చేసి తినగలిగే దివ్య ఫలంగా పుచ్చకాయలు అందుబాటులో ఉన్నాయి.

విరివిగా విక్రయాలు

ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పుచ్చకాయల విక్రయాలు అధికంగా జరుగుతున్నాయి. అన్ని మండలాల్లో చిరు వ్యాపారులు సైతం పుచ్చకాయలను విక్రయిస్తున్నారు. వీటిని కడప, మదనపల్లి తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసుకుని ఇక్కడి వ్యాపారులు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో పుచ్చకాయల వ్యాపారం ఎక్కువగా కనిపిస్తోంది. ఇతర పండ్లు, ఫలాలతో పోలిస్తే పుచ్చకాయలు సరసమైన ధరలతో లభిస్తున్నాయి. రూ.100కు కొనుగోలు చేస్తే ఇంటిల్లిపాది స్వీకరించవచ్చు. వీటిని వ్యాపారులు కేజీ రూ.20 నుంచి 25 వరకు విక్రయిస్తున్నారు. అలాగే ప్లేటు రూపేణా ముక్కలుగా చేసి అమ్ముతున్నారు. ప్రతి ఒక్కరూ ఇష్టంగా తినే పుచ్చకాయలు మార్కెట్‌లో విరివిగా లభిస్తున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వీటిని ఇష్టంగా తింటారు. వివాహాలు, శుభకార్యాల సమయంలోనూ వీటిని జోరుగా అందిస్తున్నారు.

పోషకాలు పుష్కలం

పుచ్చకాయలో విటమిన్- బి, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఎలక్ట్రోలైట్లు సమృద్ధిగా లభిస్తాయి. కొలెస్ట్రాల్ ఉండదు. ఈ కాయ తింటే రక్షణశక్తితో పాటు శరీరానికి మేలు చేకూరుతుంది. 92 శాతం ఆల్కలైన్ నీళ్లతో పాటు పీచు పదార్థం ఉండడం వల్ల శరీరానికి, మూత్రపిండాలకు, మూత్రనాళాలకు ఉపయోగకరం. పుచ్చకాయ తినడంతో మలబద్ధకం తగ్గుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వృద్ధాప్యంలో వచ్చే అంధత్వ సమస్యను తగ్గిస్తుంది. అంతేకాక సౌందర్యానికి ఉపకరిస్తుంది.

కడప నుంచి తీసుకొచ్చి అమ్ముతున్నాం



మా కుటుంబం మొత్తం వేసవి సీజన్‌లో పుచ్చకాయల వ్యాపారం చేస్తుంటాం. నాలుగు నుంచి ఐదు చోట్ల దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తాం. పుచ్చకాయలను కడప, మదనపల్లి ప్రాంతాల నుంచి టన్నుల లెక్కన కొనుగోలు చేస్తాం. జలదంకి, వింజమూరు, కావలి ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తాం. కేజీ రూ.20కు విక్రయిస్తున్నాం. వేసవి సమయంలో వ్యాపారం బాగా సాగుతుందని ఆశిస్తున్నాం.

– అజయ్, పుచ్చకాయల వ్యాపారి

ఆరోగ్యకరం



పుచ్చకాయలో అధిక శాతం నీరు ఉండడంతో శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. పిల్లలు ఎక్కువగా తింటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. రక్తపోటు తగ్గుతుంది. పుచ్చకాయలో ఉండే మెగ్నీషియం, పొటాషియం గుండె ఆరోగ్యానికి తోడ్పడుతాయి.

– జె.పద్మజ, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, గట్టుపల్లి

క్లుప్తంగా

నేటి నుంచి సంప్రోక్షణ మహోత్సవాలు



ముస్తాబైన ఉత్సవ విగ్రహాలు

వరికుంటపాడు : వరికుంటపాడులోని కోదండ రామస్వామి ఆలయంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు ఉత్సవ విగ్రహాల సంప్రోక్షణ మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు గోపూజ, గ్రామ ప్రదక్షిణ, కలశ స్థాపన, హోమాలు ఉంటాయన్నారు. ఇలా విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు ఉంటాయని వివరించారు.

మూగజీవాల కోసం నీటితొట్టెలు



భూమిపూజ చేస్తున్న ఏపీఓ

ఉదయగిరి : మండలంలో పశువులు, మూగజీవాలు, అటవీ జంతువుల దాహార్తిని తీర్చేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా నీటితొట్టెల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ మేరకు శకునాలపల్లెలో నీటితొట్టె నిర్మాణానికి ఏపీఓ శ్రీనివాసులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా వీటిని నిర్మిస్తారన్నారు. మండలానికి 50 నీటితొట్లు మంజూరైందన్నారు. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.37 వేల నిధులు చెల్లిస్తారన్నారు. కార్యక్రమంలో బీఎఫ్‌టీ ప్రసన్న, ఎఫ్‌ఏ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

సీతారామపురం : ఓరల్ హెల్త్ డే మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మంగళవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యురాలు అనీస్ సల్మా మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి పాఠశాలను విజిట్ చేసి విద్యార్థులకు ఓరల్ హెల్త్ సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. దంత సమస్యలు ఉన్నవారిని ప్రతి మంగళవారం సీతారామపురం పీహెచ్‌సీకి సోమ, బుధ, శని వారాల్లో ఉదయగిరి సీహెచ్‌సీకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి స్వప్న రెడ్డి, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వలంటీర్లు పాల్గొన్నారు.

మాధవరావుకు అవార్డు గర్వకారణం

కావలి : ప్రముఖ మెజీషియన్, కావలి వాసి వేములపాటి మాధవరావుకు రాష్ట్ర ప్రభుత్వం కళారత్న అవార్డును అందజేయడం గర్వకారణమని సామాజిక మహిళా కార్యకర్త సి.శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాధవరావు రెండువేలకుపైగా అద్భుత ప్రదర్శనలిచ్చారన్నారు. ఆయన ఖ్యాతి కావలి వాసులతో పాటు ఎందరో కళాకారులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

సకాలంలో పింఛన్ల పంపిణీ

దుత్తలూరు : మండలంలో లబ్ధిదారులకు పింఛన్ నగదును సకాలంలో అందజేయాలని ఎంపీడీఓ మల్లికార్జున తెలిపారు. దుత్తలూరు గ్రామ పంచాయతీలో జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేసి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. పింఛన్ల పంపిణీతో పాటు 70 ఏళ్లు పైబడిన వారికి వయోవందన యోజన కార్యక్రమంలో భాగంగా ఈకేవైసీ నమోదు చేయించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి షేక్.నజీముల్లా, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



ఆత్మకూరురూరల్ : మహిమలూరులో..

- **ఆత్మకూరురూరల్ :** మండల పరిధిలో 4,817 మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ పూర్తి చేశామని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మంగళవారం తెలిపారు. మిగిలిన 4,571 మందికి రెండు రోజుల్లో పంపిణీ చేస్తామన్నారు. మహిమలూరులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

లంచాలు తీసుకుంటూ తనిఖీలు ఏంటి?

- మున్సిపల్ అధికారితో వాగ్వాదం

కావలి : కావలిలో ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అధికారులు చేస్తున్న తనిఖీలు వాగ్వాదాలకు దారి తీసింది. వివరాలు.. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్ తమ సిబ్బందితో ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై స్థానిక ట్రంకు రోడ్డులోని ఓ ప్రొవిజన్స్ షాపులోకి మంగళవారం వెళ్లారు. దీంతో దుకాణ యజమానికి మున్సిపాలిటీ సిబ్బందికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. షాపులోకి ఎలా వస్తారంటూ శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బందిని అడ్డుకున్నారు. వ్యాపారస్తుల వద్ద లంచం మీరు తీసుకుంటూ, ఇలా తనిఖీలు చేయడం ఏమిటని దుకాణదారుడు నిలదీశారు. ఎవరు లంచాలు తీసుకున్నారు అంటూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించగా, దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకొంది. అరుపులు కేకలు వేసుకుంటూ ఘర్షణ వాతావరణం నెలకొంది. కొంతసేపటికి వివాదం సర్దుమణిగింది.

అశ్వవాహనంపై శ్రీరాముడు



ఆత్మకూరురూరల్ : మండలంలోని మహిమలూరులో బెస్తరాజుల ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారిని అశ్వవాహనంపై ఊరేగించారు. అనంతరం పారువేట ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆర్డీఓ పరిశీలన



ఆత్మకూరురూరల్ : మండలంలోని వెన్నవాడ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణంపై ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని మంగళవారం పరిశీలన చేశారు. ప్రభుత్వ భూమిలో ఆటంకాలు కల్పించడం తగదని, అవసరమైతే లబ్ధిదారులకు తక్షణ న్యాయంగా మరికొంత భూమిని కేటాయించి న్యాయం చేస్తామని చెప్పారు. కాగా చివరి దశలో కొందరు అడ్డుకోవడంతో తాత్కాలికంగా రోడ్డు పనులు ఆపివేశారు. అయితే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రోడ్డు నిర్మాణం చేపడుతామని, వీలు కాకుంటే ఆయా ప్రదేశాల్లో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పనులను నిలిపివేస్తామని సంబంధిత కాంట్రాక్టర్ నాగమోహన్‌రెడ్డి తెలిపారు. పంచాయతీరాజ్ పీఐయూ విభాగం డీఈ సుధాకర్‌రెడ్డి, ఏఈ ప్రసాద్ బాబు, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ సుధీర్ పాల్గొన్నారు.

సర్‌చార్జీల దోపిడీని అరికట్టాలి

- దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మల్లి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘర్షణ నేతలు

కావలి : జాతీయ బ్యాంక్‌లు సర్‌చార్జీ పేరిట చేసే దోపిడీని అరికట్టాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. కావలిలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జాతీయ బ్యాంక్‌లు సర్‌చార్జీల పేరిట గిరిజన బడుగు వర్గాలను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని తెలిపారు. మూడుసార్లు ఏటీఎం ద్వారా డబ్బులు తీసుకున్న తర్వాత లావాదేవీలకు రూ.50 కట్ చేస్తున్నారన్నారు. అలాగే ఉపాధి కూలీల నగదు బ్యాంక్‌లో పడితే సగానికి సగం తీస్తున్నారని తెలిపారు. గ్యాస్ సబ్సిడీ డబ్బులను కూడా బ్యాంక్‌లు కట్ చేసుకుంటున్నాయని వాపోయారు. ఇలా 2024–25కు రూ.96 వేల కోట్లు సర్‌చార్జీల పేరిట వసూలు చేసి పారిశ్రామికవేత్తలకు ఇస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, చౌటూరి లక్ష్మయ్య, నాగబోయిన భాస్కర్, ఎం.లక్ష్మి, జెడ్డా వాసు, ఆలూరి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ముగిసిన పది పరీక్షలు



సీతారామపురం పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల కేరింతలు

ఉదయగిరి : గత నెల 17న ప్రారంభమైన పది పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలు మండలంలోని గండిపాళెం గురుకుల, జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు, పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హోలీ ఏంజెల్స్, సెయింట్ మేరీస్ పాఠశాలల్లో నిర్వహించారు. కాగా పరీక్షలు ముగియగానే విద్యార్థులు కేరింతలు కొడుతూ బయటకు వచ్చారు. ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.

- **సీతారామపురం :** పది పరీక్షలు మండల పరిధిలో ప్రశాంతంగా ముగిసింది. చివరిరోజు సోషల్ పరీక్షను ముగించుకుని బయటకు రాగానే కేరింతలు కొట్టారు.
- **ఉదయగిరి(వింజమూరు) :** వింజమూరులోని ఐదు కేంద్రాల్లో జరిగిన పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. దీంతో విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా బయటకు వచ్చి కేరింతలు కొట్టారు. ఏడాదిపాటు ఎంతో కష్టపడి చదివి సంతృప్తికరంగా పరీక్షలు రాశామని పలువురు విద్యార్థులు తెలిపారు.
- **ఆత్మకూరు :** పట్టణంలోని మూడు కేంద్రాల్లో పది పరీక్షలు ప్రశాంతంగా ముగిసింది. అదే విధంగా చేజర్ల మండల కేంద్రంలో మూడు కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.
- **సంగం :** సంగంలోని రెండు కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా ముగిసింది. చివరి సోషల్ పరీక్షను రాసిన విద్యార్థులు ఉత్సాహంగా బయటకు వచ్చి కేరింతలు కొట్టారు.



వింజమూరులో..



ఉదయగిరి : పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



ఆత్మకూరు పట్టణంలో..



సంగం మండల కేంద్రంలో..

వైభవంగా వెంకటేశ్వరుని గ్రామోత్సవం



దుత్తలూరు : మండలంలోని రెడ్లదిన్నె దేవరబోడుపై కొలువైన లక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి గ్రామోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. గత మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి దేవదేవేరులకు శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాగా మంగళవారం వేకువజామునే ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలు, బాణసంచా నడుమ నందిపాడు, రెడ్లదిన్నె, పాపంపల్లి, బొటికర్లపాడు గ్రామాల్లో గ్రామోత్సవాన్ని జరిపించారు. భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

డయాలసిస్ సెంటర్‌లో ఎమ్మెల్యే పరిశీలన



వింజమూరు(ఉదయగిరి) : వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన డయాలసిస్ సెంటర్‌ను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంగళవారం పరిశీలించారు. ఈనెల 4, 5 తేదీల్లో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా దీనిని ప్రారంభిస్తామని చెప్పారు. వైద్యశాలకు అవసరమైన సిబ్బంది, వైద్యుల కొరత గురించి నివేదిక తయారుచేయాలని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. అనంతరం స్థానిక జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. స్థానిక నాయకులు జూపల్లి రాజారావు, వనిపెంట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

కావలి : పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కావలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుశీల్‌కుమార్ ప్రియ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పట్టణంలోని విశ్వోదయ బాలికల హైస్కూల్, రూరల్ మండలం రుద్రకోట గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు. పూర్తి వివరాలకు 99490 22772, 99667 97981 నంబర్లను సంప్రదించాలన్నారు.

పలువురికి సన్మానం



అర్చకుడు శివకుమార్‌శర్మకు సన్మానం

ఆత్మకూరు : పట్టణానికి చెందిన శ్రీభారతి సంగీత నృత్య విద్యాలయం వార్షికోత్సవం సందర్భంగా పలు రంగాల్లో నిష్ణాతులైన వారిని మంగళవారం సన్మానించారు. సంస్థ నిర్వాహకులు కొండూరు అపర్ణ చక్రవర్తి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సంఘాల ఉపాధ్యక్షుడు మేళ్లచెరువు శివకుమార్‌శర్మను, డాక్టర్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా డాక్టర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ప్రణీత్, డాక్టర్ హారిక దంపతులు, దాత కంచి పరమేశ్వరరెడ్డి, నృత్య, సంగీత గురువులు అనంతబొట్ల రమాదేవి, జి.ఆనంద్‌లను సన్మానించారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న మేకపాటి

- పార్టీ శ్రేణులకు మేకపాటి భరోసా

ఉదయగిరి : 'రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయం రావడం ఖాయం.. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు.. మేము అన్నివిధాలా అండగా ఉంటాం' అని పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో ఉదయగిరి పార్టీ నేతలు, కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ, కాలం నెట్టుకొస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం పార్టీ శ్రేణులు సమష్టిగా అధికార పక్షానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. నియోజకవర్గంలో కొంతమంది అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని, అలాంటి వారిని గుర్తించుకొని మన ప్రభుత్వం వచ్చిన వెంటనే తగిన గుణపాఠం చెబుతామన్నారు. మన పార్టీ వారు అనవసర గొడవల జోలికి వెళ్లొద్దని, అలా మన జోలికి వస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు మోది రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.ఓబుల్‌రెడ్డి, పార్టీ నేతలు చేజర్ల సుబ్బారెడ్డి, షేక్ అలీఅహ్మద్, అక్కి భాస్కర్‌రెడ్డి, మూలే వినయరెడ్డి, హరాస్సేన్, కల్లూరు కృష్ణారెడ్డి, కె.రమణారెడ్డి, కొండా రాజా, గొల్లపల్లి తిరుపతి, షేక్ సుబానీ, బాలిపోయిన శ్రీనివాసులు, సోమిరెడ్డి, అంబటి సుబ్బారెడ్డి, మూలే సుబ్బారెడ్డి, గడియాల్చి యస్దానీ, అక్కులరెడ్డి రమణ, కల్లూరు రాజారెడ్డి తదితరులు ఉన్నారు.



మేరెడ్డి శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

పరామర్శ

ఉదయగిరి పట్టణానికి చెందిన పార్టీ నేత మేరెడ్డి శ్రీనివాసరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. యోగక్షేమాల గురించి విచారించారు.

రైతులకు పరిహారం చెల్లించండి

- ఆర్డీఓకు వినతి



ఆత్మకూరు ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

ఆత్మకూరు : భారతమాల 67వ జాతీయ రహదారి నిర్మాణంలో భూములను కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం పెంచి ఇవ్వాలని వారు ఆత్మకూరు ఆర్డీఓ బి.పావనిని మంగళవారం కోరారు. ఈ మేరకు ఆమెకు తన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతసాగరం మండలం పరిధిలోని ఆమనిచిరివెళ్ల, ఇనగలూరు, బెడుసుపల్లి, పాతదేవరాయపల్లి తదితర గ్రామాల్లో నూతన రహదారి నిర్మాణం జరగనున్న క్రమంలో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం మేరకు నష్టపరిహారం అందించాలని వారు కోరారు. ప్రస్తుతం ప్రకటించిన పరిహారం తక్కువ అని, రైతుల నష్టాన్ని పరిశీలించి పరిహారం పెంచి పంపిణీ చేయించాలని కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు లక్ష్మి, సీఐటీయూ నాయకులు అన్వర్‌బాషా, ఉప్పలపాడు మస్తాన్, రైతులు ప్రసాద్‌రెడ్డి, పుల్లారెడ్డి, బి.వెంకటేశ్వర్లురెడ్డి, గండికోట పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రైతుల వినతి

తమ భూముల మీదుగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని, అలా కాకుండా భూ అంచుల వద్ద నుంచి రోడ్డు నిర్మాణం చేయాలని మండలంలోని వెన్నవాడ రైతులు ఆత్మకూరు ఆర్డీఓ పావనికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఆర్డీఓ తాను భూములను పరిశీలించానని, ప్రత్యామ్నాయంగా సమీపంలోనే కోల్పోయిన భూమికి సమానంగా భూమి ఇప్పించేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తానని, ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలి



బోగోలులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

బిట్రగుంట : దైవ సందేశకుడు పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు చేసి ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని మండల పరిధిలోని క్రిస్టియన్లు, పాస్టర్లు సోమవారం శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. బోగోలు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో 16 పంచాయతీలకు చెందిన పాస్టర్లు, దైవసందేశకులు, క్రిస్టియన్లు విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలోని పెట్రోల్ బంక్ నుంచి బోగోలులోని అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ప్రవీణ్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం త్వరితగతిన విచారణ పూర్తి చేసి వాస్తవాలు వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ జి.శ్యామ్‌సన్‌బాబు, కార్యదర్శి రెవరెండ్ సీహెచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.